క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని సూచించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడు ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను ఇంటి వద్దకు పోలీసులు అప్పగించారు.

- ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

అందరి సహకారంతో సంఘ అభివృద్ధి

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఆదివారం కాపు తెలగ జన ఐక్యత సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కంచరపాలెం కాపు సంఘం చైర్మన్ గంట్ల శ్రీనుబాబు, ముఖ్య సలహాదారుడు జి.వి.నరసింహమూర్తి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తమ వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తామని చెప్పారు. డిసెంబర్‌లో వనభోజనాలు, నూతన సభ్యుల చేరికలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కొండబాబు, మహి, రాము, మహేష్, దుర్గా, చంద్రరావు, శ్రీధర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ


శ్రీనివాస్‌కు సరకులు అందిస్తున్న మణికంఠ సేవా సంఘం సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ మణికంఠ సేవా సంఘం సభ్యులు నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమాన్ని ఆదివారం సందర్శించారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అవసరమైన నిత్యావసర సరకులను నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్‌కు అందించారు. ఇందుకు అవసరమైన రూ.6 వేల ఆర్థిక సాయాన్ని సంఘ సభ్యులు నగేష్, సురేష్ అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎం.రవికిరణ్, నాగేందర్, కోశాధికారి ఆనంద్, బిల్లింగ్, చంటి, సురేష్, రమేష్, రాజారావు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు


సీతంపేట మెయిన్ రోడ్‌లో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. సీతంపేట మెయిన్ రోడ్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న ఎస్‌డబ్ల్యూ సీసీ డ్రెయిన్ పనులు చివరి దశకు వచ్చాయి. పాత డ్రెయిన్ పూడుకుపోవడం, గోడలు, బేస్‌మెంట్ శిథిలమవడంతో నీటి ప్రవాహానికి తరచూ అడ్డంకులు ఏర్పడి మురుగు రోడ్డెక్కి ప్రవహించేది. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చొరవతో డ్రెయిన్ పునర్నిర్మాణానికి జీవీఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించారు. పాత డ్రెయిన్ కంటే మరింత వెడల్పుగా సీసీ డ్రెయిన్ నిర్మించి, వాటి పైకప్పుగా సిమెంట్ పలకలు వేశారు. చెత్త తొలగించడానికి వీలుగా ఎక్కడికక్కడ మ్యాన్‌హోల్స్ నిర్మించారు. చాలా కాలంగా ఉన్న డ్రెయిన్ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సరికొత్తగా సర్కారు బడి



విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో కనీస సదుపాయాలకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలలకు ఆయన సుపరిపాలనలో మహర్దశ పట్టింది. మన బడి నాడు–నేడు కార్యక్రమంతో సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్కూళ్లకు మించిన సౌకర్యాలు కల్పించారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలు తెచ్చింది. సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల చదువుకు అగ్రస్థానం కల్పిస్తూ కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆధునికీకరించారు. పిల్లలను బడికి పంపే తల్లికి భారం కాకూడదని అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద వంటి పథకాలతో అండగా నిలిచారు.

- 'మన బడి నాడు–నేడు'తో పాఠశాలలకు మహర్దశ
- కోట్ల రూపాయల నిధులతో ఆధునికీకరణ
- కార్పొరేటర్ స్కూళ్లకు దీటుగా సకల సౌకర్యాలు
- గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య




నేడు: మధురానగర్ జీవీఎంసీ స్కూల్ భవనం


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో నిర్మించిన మోడ్రన్ వాష్ బేసిన్లు


నాడు: మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు


నేడు: మోడ్రన్ లుక్‌లో మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు



నాడు: మధురానగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో వాటర్ క్యాన్లు



నేడు: మధురానగర్ పాఠశాలలో ఆర్వో మినరల్ వాటర్ సదుపాయం


నాడు: మధురానగర్ పాఠశాల భవనం

సీతంపేట: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే దుంపల బడి అని ముద్ర ఉండేది. కనీస సదుపాయాలకు నోచుకోక విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపేవారు కాదు. ఇంగ్లిష్ మీడియం చదువుల కోసం కాన్వెంటులు, కార్పొరేట్ స్కూళ్లకు వేలాది రూపాయలు ఫీజులు ఖర్చు చేయాల్సి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడేది. ప్రజాసంకల్ప యాత్రలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దానిని మార్చాలని తలంచారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని సంకల్పించారు. అధికారంలోకి రాగానే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. దీని కోసం ప్రభుత్వం ప్రారంభించిన మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకురావడానికి నిధులు మంజూరు చేసింది.

నిధులు.. అభివృద్ధి పనులు

నియోజకవర్గంలోని 25, 26, 43, 44 వార్డుల్లో మొత్తం 7 జీవీఎంసీ పాఠశాలలు ఉండగా.. 5 స్కూళ్లను నాడు–నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేశారు.

- 25వ వార్డు సీతంపేట మధురానగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నాడు–నేడు కింద రూ.21.64 లక్షలు మంజూరయ్యాయి. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌కు రూ.42 లక్షలు మంజూరు చేశారు. అదనపు అంతస్తు కోసం జీవీఎంసీ నిధులు రూ.36 లక్షలు మంజూరయ్యాయి.

ఇవీ సదుపాయాలు

నాడు–నేడుకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మౌలిక సదుపాయాలు కల్పించారు.

- ఇంగ్లిష్ మీడియం బోధన, కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించడంతో జీవీఎంసీ పాఠశాలల్లో కొత్త విద్యార్థుల చేరికలు అనూహ్యంగా పెరిగాయి.
- ప్రతి విద్యార్థి బెంచీలపై కూర్చునేలా డెస్కులు ఏర్పాటు చేశారు.
- విద్యార్థులకు విద్యా కానుక ద్వారా బ్యాగు, బూట్లు, సాక్స్‌లు, బైలింగువల్ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, యూనిఫారం, బెల్ట్ ఇస్తున్నారు.
- నిరంతర నీటి సరఫరాతో అత్యాధునిక టాయిలెట్లు, వాష్ బేసిన్లు, ఆర్వో ఫిల్టర్ వాటర్ సదుపాయాలు కల్పించారు
- ట్యాబ్స్, 2డీ, డీ చిత్రాలతో డిజిటల్ విద్యా బోధన, విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ)తో బోధన, చిత్రాలు, గ్రాఫిక్స్‌తో దృశ్య, శ్రవణ మాధ్యమాల్లో పాఠ్యాంశాల బోధన జరుగుతోంది.

25, 26, 43, 44 వార్డుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు	: 7
నాడు-నేడుకు ఎంపికైన పాఠశాలలు	: 5
అభివృద్ధి పనుల ఖర్చు	: రూ.1.30 కోట్లు
ఉపాధ్యాయుల సంఖ్య	: 58
2019లో విద్యార్థుల సంఖ్య	: 1,147
ప్రస్తుత విద్యార్థుల సంఖ్య	: 1,636
పెరిగిన విద్యార్థుల సంఖ్య	: 489



నాడు: జీవీఎంసీ హైస్కూల్‌లో బెంచీలు



నేడు: తరగతి గదిలో డెస్క్ బెంచీలు

మధురానగర్ పాఠశాల చాలా బాగుంది



మేము ద్వారకానగర్ 5వ లేన్‌లో ఉంటున్నాం. నాకు ఒక పాప, బాబు. ఇద్దరినీ సీతంపేటలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో చదివించేదాన్ని. నా స్నేహితురాలు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో సదుపాయాలు బాగుంటాయని, టీచర్లు బాగా బోధిస్తారని చెప్పడంతో పిల్లలిద్దరినీ అక్కడ చేర్పించాను. పాప 7 నుంచి 10 వరకు మధురానగర్ స్కూల్‌లో చదివింది. టెన్త్‌లో 525 మార్కులు వచ్చి టాపర్‌గా నిలిచింది. బాబు కూడా అక్కడే 8వ తరగతి చదువుతున్నాడు. ప్రైవేట్ స్కూల్‌లో కూడా లేని సౌకర్యాలు, ఇంగ్లిష్ మీడియం బోధన ఇక్కడ ఉంది. మధ్యాహ్నం భోజనం చాలా బాగుంటుంది. నేను చాలా మందికి చెప్పి వారి పిల్లలను ఇక్కడ జాయిన్ చేయించాను.

– డి.జమున, విద్యార్థుల తల్లి, ద్వారకానగర్

ఆరిలోవ నుంచి బస్సులో వస్తున్నాం



నేను, నా తమ్ముడు, చెల్లి ఆరిలోవలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో చదివేవాళ్లం. అక్కడ కనీస సదుపాయాలు ఉండేవి కాదు. మా నాన్న ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.5 వేల ఫీజు చెల్లించేవారు. బుక్స్, యూనీఫారంకు చాలా ఖర్చయ్యేది. మధురానగర్ స్కూల్‌లో చదువు బాగా చెబుతారని, అన్ని సదుపాయాలు ఉన్నాయని మా డాడీ స్నేహితుడు చెప్పడంతో ఇక్కడ చేరాం. రోజూ 69 బస్సులో ఆరిలోవ నుంచి మధురానగర్ స్కూల్‌కు వస్తున్నాం. బస్ పాస్‌లు కూడా ఫ్రీ. ఈ పాఠశాలలో వాష్ రూమ్స్ నీట్‌గా ఉన్నాయి. ఆర్వో మినరల్ వాటర్ ఉంది, మధ్యాహ్నం భోజనం చాలా బాగుంది. బుక్స్, యూనీఫాం, షూష్, బెల్ట్ అన్నీ ఇచ్చారు. ఇంగ్లిష్ మీడియం, స్మార్ట్ క్లాసెస్ జరుగుతున్నాయి.


– కావ్యశ్రీ ప్రియ, ఆనంది, విద్యార్థులు, ఆరిలోవ

సహజ నటుడు చంద్రమోహన్


చంద్రమోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తలు

సీతంపేట: సహజ నటనతో నవరసాలు పండించి తెలుగు ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన లెజండరీ నటుడు చంద్రమోహన్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మరణించిన సినీ నటుడు చంద్రమోహన్ సంస్మరణ సభ ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయం సహకారంతో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. చంద్రమోహన్ చిన్నాన్న కుమార్తె నగరవాసి నాగరాజ కుమారి, డి.వి.సూర్యారావు, నరవ ప్రకాశరావు తదితరులు చంద్రమోహన్ చిత్రపటానికి పూలదండలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖతో చంద్రమోహన్‌కు మంచి అనుబంధం ఉందన్నారు. ఆయన నగరానికి ఎప్పుడు వచ్చిన నాగరాజకుమారి ఇంట్లో ఉండేవారని తెలిపారు. 900కుపైగా చిత్రాల్లో నటించి మెప్పించారన్నారు. ఆయన మరణం తెలుగు చిత్రపరిశ్రమకు తీరని లోటని విచారం వ్యక్తం చేసారు. త్వరలో ఆయన పేరున ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని నరవ ప్రకాశరావు తెలిపారు. చంద్రమోహన్‌కు ఎనలేని కీర్తిని తెచ్చిన సీతామహాలక్ష్మి(1978) చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, బాబ్జీ, అనురాధ, లైబ్రరీ ఇన్‌చార్జి దుర్గారాణి, చంద్రమోహన్ అభిమానులు పాల్గొన్నారు.

బహుజన ధీర వనితల కథనాలే 'మిణుగురులు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీవీవో కరుణరాజు తదితరులు

సీతంపేట: చరిత్ర విస్మరించిన బహుజన ధీర వనితల కథనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని స్టీల్‌ప్లాంట్ సీవీవో డాక్టర్ ఎస్.కరుణరాజు అన్నారు. చల్లపల్లి స్వరూపరాణి రచించిన మిణుగురులు పుస్తకావిష్కరణ సభ సావిత్రీభాయి పూలే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బహుజన వీర వనితల చరిత్రను వెలుగులోకి తేవడం అభినందనీయమని రచయిత్రిని కొనియాడారు. ఈ పుస్తకం భావితరాలకు కనువిప్పుగా, స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీభాయి తరువాత పోరాడి యుద్ధభూమిలో ప్రాణాలర్పించిన జర్కారీ బాయి గురించి ఈ పుస్తకంలో తెలుసుకోవచ్చన్నారు. డాక్టర్ కె.ఎన్.మల్లేశ్వరి పుస్తకాన్ని సమీక్షించారు. రచయిత మాటూరి శ్రీనివాస్, జర్నలిస్టు బెందాళం కృష్ణారావు, పీవో డబ్ల్యూ లక్ష్మి, సి.ఎం.ఎస్.లలిత, బండి సత్యనారాయణ, ,ఎన్.బాబూరావు, స్పెక్ట్స్ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి ప్రసంగించారు.

మహిళా వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డులు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డులు లభించాయి. ఇటీవల నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో అవార్డులు ప్రకటించారు. ఉత్తమ అధ్యక్షురాలిగా ఎం,శేషామణి, ఉత్తమ కార్యదర్శిగా సనపల పుష్పలత, ఉత్తమ కోశాధికారిగా సిహెచ్.లక్ష్మి, ఉత్తమ బులిటెన్ ఎడిటర్‌గా దర్భా శిరీష, డిస్ట్రిక్ట్–101 ప్రో, ట్రస్టీబోర్డు మెంబర్‌గా కె.మాధవి, ఫండ్ రైజింగ్ క్లబ్‌గా మహిళా వాకర్స్ క్లబ్‌ను ఎంపిక చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణికి ఈ అవార్డులు అందించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

మద్రిపాలెం: పుస్తకాలు చదవడం ద్వారానే విద్యార్థులకు విజ్ఞానం వస్తుందని ఎంఎస్ఆర్ లైబ్రరీ అధ్యక్షుడు అన్నెపు నారాయణరావు పేర్కొన్నారు. మాధవధార ఎంఎస్ఆర్ పార్కులోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. మాస్టార్ వి.రాజేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ పార్కు అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ఎస్.రావు, వై.సూరరాజు, పి.చంద్రశేఖర్, బీ.శ్రీను, జీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిక్కుల నగర సంకీర్తన


విన్యాసాలు చేస్తున్న చిన్నారులు


సిక్కులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఫారూఖీ

సీతమ్మధార: సిక్కుల మత గురువు గురునానక్ దేవ్‌జీ జయంతి సందర్భంగా ఆదివారం గురుద్వారా ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 24 గంటల సంకీర్తనలు చేసి మత పెద్దలు ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం లంగర్(మధ్యాహ్న భోజనం) ఏర్పాటు చేశారు. గురునానక్ దేవ్‌జీకి ట్రాలీపై ఆసినింపజేసి మధ్యాహ్నం నగర సంకీర్తనా ఘనంగా జరిపారు. గురుద్వారా అధ్యక్షుడు డి.ఎస్.ఆనంద్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కత్తి, కర్రలతో విన్యాసాలు, ప్రదర్శించారు. సిక్కులు సంప్రదాయ ప్రకారం ఊరేగి ంచే రహదారి అంతా నీరు వేసి చీపుళ్లతో శుద్ధి చేశారు. గురుద్వారా నుంచి సీతంపేట, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎల్ఐసీ భవనం, జైలురోడ్డు, సెవెన్స్‌హిల్స్, నౌరోజీరోడ్డు, బీచ్‌రోడ్డు, మద్దిలపాలెం మీదుగా తిరిగి మందిరానికి ర్యాలీ చేరుకుంది. అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు, పాల్గొని భక్తిభావాన్ని చాటుకున్నారు.

వెయ్యి మందికి పండ్ల పంపిణీ

సీతంపేట: గురునానక్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ శాఖ ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫారూఖీ ఆధ్వర్యంలో ఇతిహాద్ ముస్లిం కమ్యూనిటీ, మొహిసిన్ బ్రదర్స్ సహకారంతో సుమారు వెయ్యి మంది సిక్కులకు పండ్లు పంపిణీ చేశారు. హిందూ ముస్లిం భాయ్ భాయ్, సిక్ ముస్లిం భాయ్ భాయ్ అంటూ ఆనందోత్సాహాలతో నినాదాలు చేశారు. అక్కయ్యపాలెంలో ర్యాలీగా వెళ్తున్న సిక్కులకు పండ్లు అందించి ఫారూఖీ శుభాకాంక్షలు తెలిపారు. మూసా మెహిది, రియాజ్ ఖాన్, జాఫర్ హుసేన్, ఖాదర్ బాబా, ముస్లిం తాటిచెట్లపాలెం యూత్ బాషా, నిజాం, తారా మసీద్ యూత్ పాల్గొన్నారు.

కార్తీక పూజలకు ఆలయాలు సిద్ధం


విద్యుద్దీప కాంతుల్లో ఉమానీలకంఠేశ్వరాలయం

సీతమ్మధార: కార్తీక మాస తొలి సోమవారం పూజలకు 14, 24 వార్డుల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం 4 గంటల నుంచి ఆలయంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రధాన అర్చకుడు రామారావు శర్మ మాట్లాడుతూ మొదటి సోమవారం ఉదయం 4 గంటలకు ధర్మకర్తల అభిషేకం, 6 గంటల నుంచి భక్తులచే విశేష పూజలు చేస్తున్నట్లు చెప్పారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు చేశారు. 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శివపార్వతి సమేత త్రిముఖ విఘ్నేశ్వరాలయంలో కార్తీక మాస పూజలకు అన్నీ సిద్ధం చేసినట్లు ఆలయ అధ్యక్షుడు టీఎస్ఎన్ మూర్తి తెలిపారు.